# మ్యాచింగ్



'హరిప్రియ' మాసపత్రిక . . . ఆగస్ట్, 2003

గిరీశం మాస్టారు ఉన్న ప్రతి క్లాసు కూడా ఎంతో సంతోషంగా, నవ్వుతూ, పేలుతూ సాగిపోతుంటుంది.

తాను నవ్వకుండా ఇతరులను నవ్వించడంలో ఆయనకి ఆయనే సాటి! ఆయన క్లాసు చెప్పే నలభై ఐదు నిమిషాలూ నాలుగు సెకండ్లలా జరిగిపోతుంది. అట్లాగని పాఠాలు జరగవనుకోడానికి వీలు లేదు. పాఠం పాఠంలా కాకుండా, ఇష్టాగోష్టిలాగా కానిస్తూ, చక్కగా అర్థమయ్యేట్టు, సారాంశం ఒంటపట్టేట్టు చెప్పడం ఆయన ప్రత్యేకత.

దసరా సెలవులైన తర్వాత ఆరోజు తిరిగి కాలేజీ తెరిచారు. గిరీశం మాస్టారు క్లాసులోకి వచ్చారు. ఆయన రాగానే ఒక వెలుగు వచ్చినట్లయింది. లేచినుంచున్న విద్యార్థుల వంక ఒక్కసారి తేరిపార చూశారు. చిరునవ్వు నవ్వుకుంటూ "సిట్‌డౌన్..!" అన్నారు.

పిల్లలంతా కూర్చున్నారు.

"ఏమిట్రా... కొత్త పెళ్ళికొడుకుల్లాగా ముస్తాబయి వచ్చారు?! దసరా సరదాలా ఏమిటి?" అన్నారు. పిల్లలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"సార్... మేమే కాదండీ.. అమ్మాయిలు కూడా ముస్తాబయ్యారు!" అని సన్నగా సన్నాయి నొక్కు నొక్కింది వెనకనుంచి ఓ కంఠం.

"ఈరోజుల్లో మగవాళ్ళకీ, ఆడవాళ్ళకీ తేడా తెలియడం లేదు. అందుకే అందర్నీ పెళ్ళికొడుకులుగా జమ చేశాను. అదిసరే గాని, ఈ గంటా పంట్లాములేమిట్రా... అప్పడాలు వ్రేలాడిపోయినట్లు!" అన్నారు గిరీశం. కాస్‌రూమ్ నవ్వులతో ప్రతిధ్వనించింది.

"వెంకట్రావు... నీ జుట్టేమిటి? ఆ షర్టేమిటి? జూలో ఉన్న జంతువులన్నింటినీ నీ షర్టు మీదే దింపుకున్నావు! నువ్వు మాత్రం ఆ జూ వైపు నుంచి రాకు... ఏదో మృగం తప్పిపోయిందనుకొని నిన్ను పట్టుకొని బోనులో పెట్టేరు!" అన్నారు మాస్టారు తిరిగి.

తిరిగి నవ్వులతో క్లాస్‌రూమ్ దద్దరిల్లింది.

"నాయనా షేక్ ఇమాం... పాహిమాం, పాహిమాం! ఇదెక్కడ షర్టయ్యా... న్యూస్ పేపరంతా నీ షర్టు మీదే ఉంది. అదేదో ఊళ్లో గోడ వార్తపత్రికలు మొదలెట్టారట! నువ్వు చొక్కా న్యూస్‌పేపర్ మొదలెట్టావేమిటి? అయినా, అదేం ప్యాంటయ్యా బాబూ... చిరిగిపోయిన నూనెగుడ్డలన్నీ అతుకువేసినట్టు! రామరామ... ఏమి ఫ్యాషన్లయ్యా ఇవి!" అన్నారు గిరీశం మాస్టారు.

"అవన్నీ దసరాపండక్కి కొత్తగా కుట్టించుకున్న బట్టలు సార్!" అని వెనక బెంచీ వర్గాల నుంచి ఓ విద్యార్థి అరిచాడు.

"ఊఁ... బాగున్నాయి మీ ఫ్యాషన్లు!" అన్నారు మాస్టారు. ఈసారి ఆయన దృష్టి విద్యార్థినుల వైపు మళ్లింది.

ఆడపిల్లల గుండెలు ఝల్లుమన్నాయి! అయితే గిరిజ మాత్రం తొణకలేదు, బెణకలేదు. ఆమె స్వతహాగా చాలా పెంకిపిల్ల! ఎవర్నీ లెక్కచేయదు. ధైర్యంలో మగవాళ్ళని మించినటువంటిది. గిరీశం మేస్టారి హాస్యానికి ఝడిసి ఆయనంటే గౌరవం చూపించేది కాని, మిగిలిన లెక్చరర్లని తీసికట్టేసేది.

"ఇన్నాళ్లూ ఫోటో సింథసిస్ ప్రక్రియ కేవలం వృక్షాలలో మాత్రమే జరుగుతుందని అనుకునేవాడిని. కాని, ఈరోజు గిరిజని చూశాక అది మనుషులలో కూడా ఉండగలదని తెలుస్తోంది!" అన్నారు మాస్టారు. పిడుగులు పడుతున్నట్లుగా నవ్వసాగారు మగపిల్లలు.

గిరిజ ముఖం అభిమానంతో ఎఱ్ఱబడింది. "మీ ఉద్దేశం ఏమిటి సార్!" అని కొంచెం కోపంగా అడిగింది.

"లేకపోతే ఏమిటమ్మా?! ఆ ఆకుపచ్చని చీరేమిటి? ఆపైన అదే రంగు బ్లౌజేమిటి? అది చాలక ముఖాన్న, పాపిటలోను ఆ ఆకుపచ్చని బొట్టేమిటి, కనుకొలకులకి ఆకుపచ్చని చారలేమిటి?" అన్నారు గిరీశం మాస్టారు.

"అవన్నీ లేటెస్ట్ ఫాషన్స్ సార్! మ్యాచింగ్ కోసం అన్నీ ఒకే రంగు ఉండాలి!" అంది గిరిజ.

"ఓయి నీ మ్యాచింగ్ బంగారం గాను! మ్యాచింగ్ కోసం అన్నీ ఆకుపచ్చగా ఉండాలంటే కష్టం! జీవితంలో అసలు మ్యాచి సమయం వచ్చేసరికి- మ్యాచింగ్ కోసం దసరా పండుగల్లో ఒంటికి ఆకుపచ్చని రంగు పులుముకొని, హనుమంతుడి వేషం వేసి రోడ్లమీద గంతులేస్తుంటారే- అటువంటి వాడిని ఎన్నుకోవలసి వస్తుంది!" అన్నారు గిరీశం మాస్టారు.

ఈసారి ఆడా, మగా అందరూ పగలబడి నవ్వారు... ఒక్క గిరిజ తప్ప!

ఏ మాటంటే ఏమొస్తుందోనని ఊర్చుండిపోయింది ఆమె! పాపం... ఆనాటి నుంచి మ్యాచింగ్ కోసం తాపత్రయపడలేదు గిరిజ.

'హరిప్రియ' మాసపత్రిక . . . ఆగస్ట్, 2003